క్లుప్తంగా

ఎక్సైజ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రభుకుమార్

జంగారెడ్డిగూడెం : నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.ప్రభుకుమార్ తెలిపారు. శుక్రవారం నవోదయం 2.0లో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రభుకుమార్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు మండలాలను ఏ, బీ, సీ కేటగిరిలో ఉన్న గ్రామాలను ఈ నెల 31వ తేదీలోగా నాటుసారా రహిత గ్రామాలుగా చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర



తిరంగా యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

కొయ్యలగూడెం: మండలంలోని గవరవరంలో శుక్రవారం పలు రాజకీయ పార్టీల నాయకులు తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ శ్రేణులతో పాటు అనుబంధ విభాగాల నాయకులు, అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు భారత మాతకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ అమరవీరులకు నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు, కట్టా సత్యనారాయణ, కటిక రాధాకృష్ణ, బాలం నరేష్, అమిరిశెట్టి దిలీప్, బొమ్మ బాబు, చిటికెన రమేష్, బొమ్మ గణేష్, చిరువురి ఉష, కొత్త రమ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు వెండి సమర్పణ




నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి వెండి చీర తయారీకి దాత పవన్‌కళ్యాణ్ కుటుంబ సభ్యులు 5 తులాల వెండి అమ్మవారికి సమర్పించారన్నారు. శ్రీనూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం చక్కెర పొంగలి, తిరుపతి దిలీప్ సూర్య రవ్వ పులిహోర అందించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని మారంపల్లిలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,600 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ముహూర్త పత్రికను గ్రామ పెద్దలకు అందజేస్తున్న పురోహితులు

కొయ్యలగూడెం: స్వయంభు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణ శంకుస్థాపన జూన్ ఆరో తేదీన నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు తాడికొండ మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కాన్వ విద్యా పీఠాధిపతి బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహశర్మ మూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శ్రీసౌమ్య నామ సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుక్రవారం ఉదయం 7.50 గంటలకు ముహూర్తంగా నిర్ణయించారు. ఆలయ నూతన కమిటీ సభ్యుల సమక్షంలో ముహూర్త పత్రికను పురోహితుల చేతుల మీదుగా గ్రామ పెద్దలు అందుకున్నారు.

ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నూతన కమిటీ ఏర్పడిన తర్వాత మొదటి హెచ్‌డీఎస్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో చింతలపూడి ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు.

కదిలే స్పీడు బ్రేకర్లు

- పందులు, పశువుల సంచారంతో ప్రజల ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- నగర పంచాయతీలో దుస్థితి.. పట్టించుకోని అధికారులు



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏలూరు ప్రధాన రహదారిపై యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులు



తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ కార్యాలయాల సమీపంలో గుంపులుగా తిరుగుతున్న పందులు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయితీలోని పలు ప్రాంతాల్లో పందులు, పశువులు స్వైర విహారం చేస్తున్నాయి. చింతలపూడి పట్టణ ప్రజలు చాలా కాలంగా విచ్చల విడిగా సంచరిస్తున్న పందులు, పశువుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయితీ పరిధిలోని వీధులు, పేటలు ఇలా అన్ని చోట్ల ఇవి లేని ప్రదేశం లేదు. ముఖ్యంగా బైపాస్‌రోడ్, ప్రభుత్వ ఆసుపత్రి, మెయిన్‌బజారు, ముస్లిం వీధి, జీబీజీ రోడ్డు, పాత బస్టాండ్ , మారుతీనగర్, గణేష్ కాలనీ, గాంధీ నగర్, భట్టువారిగూడెం ,కొత్త బస్టాండ్, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ తదితర ప్రాంతాల్లో విచ్చల విడిగా సంచరిస్తూ వాహన దారులకు, గృహిణులకు, తీవ్ర ఇబ్బందులు కలుగ చేస్తున్నాయి. అంటు వ్యాధులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా వీధుల్లో, డ్రైనేజీల్లో పందులు నివాసం ఏర్పాటు చేసుకుని దుర్వాసన వెదజల్లుతున్నాయి. రాత్రుళ్ళు అయితే పందుల యజమానులు పందులను గుంపులుగా తోలుకు వచ్చి మారుతీనగర్, ఎన్‌వీఎన్ కాలనీ ప్రాంతాల్లో విడిచి పెడుతున్నారని, అవి ఇళ్ళల్లోకి చొరబడి మొక్కలు, ఇతర సామాగ్రిని ధ్వంసం చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు.

తెల్లవారుజాము నుంచే పశువుల సంచారం

ఇక ప్రధాన రోడ్లపై పశువులు యథేచ్ఛగా స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తెల్లవారు జామున 5 గంటల నుంచే పశువుల సంచారం ప్రారంభమవుతుంది. పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇవి రోడ్డుపై యథేచ్ఛగా తిరుగుతూ మొబైల్ స్పీడ్ బ్రేకర్లుగా మారి వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటలూ రోడ్లపైనే నివాసం ఉంటున్నాయి. ఈ పశువులు ఎవరివో, ఎక్కడి నుంచి వచ్చాయో ఎవరికీ తెలియదంటున్నారు. ఒక్కోసారి ఇవి ఒకదానిపై మరొకటి కలబడినప్పుడు ఎవరిపై పడతాయో తెలియక వాహనదారులు, పాదచారులు హడలిపోతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి వీటి యజమానులకు నోటీసులు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



పశువులు, పందులు ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా తిరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. పందులు, పశువులు రోడ్లపై తిరగడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. పశువుల యజమానులను సమావేశ పరిచి పశువులను జాగ్రత్త చేసుకునే విధంగా ఆదేశించాలి. పందులను ఊరికి దూరంగా పెంచుకోవాలని వాటి పెంపకందారులను హెచ్చరించాలి.

– బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్, చింతలపూడి

అయ్యప్ప ఆలయంలో పూజలు



జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు చేశారు. అమ్మవారికి పంచామృత అభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

అహల్యాబాయి జయంత్యుత్సవాలకు పిలుపు

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధురాలు, మరాఠా రాజ్య సామ్రాజ్యవాది అహల్యాబాయి హోల్కర్ త్రి శతజయంత్యుత్సవాలు ప్రజలు ఘనంగా నిర్వహించుకోవాలని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శరణాల మాలతీరాణి పిలుపు ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం వెంకయ్యపాలెంలోని శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళా మోర్చా కార్యకర్తలతో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అహల్యాబాయి ఈ నెల 31వ తేదీకి జన్మించి 300 సంవత్సరాలు కాబోతుందన్నారు. కార్యక్రమంలో బొల్లిన నిర్మల కిషోర్, డాక్టర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు



సాగునీటి చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేస్తున్న అక్రమార్కులు

కొయ్యలగూడెం: పొంగుటూరు పంచాయతీ కన్నాయిగూడెం గ్రామ శివారులోని సాగునీటి చెరువులో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. 20వ తేదీతో తవ్వకాల అనుమతులు పూర్తయినప్పటికీ మూడు రోజుల నుంచి రేయింబవళ్లు మట్టి తవ్వకాలు చేస్తున్నారని సాగునీటి చెరువు రైతులు శుక్రవారం ఆరోపించారు. వ్యవసాయం చేసే పొలాల్లోకి మట్టి తీసుకెళ్లడానికి మాత్రమే మట్టి తవ్వకాలకు అనుమతి ఉన్నా, ఇటుక బట్టీలకు, ఇక్కడి నుంచి తెలంగాణ వరకు లారీలతో మట్టిని తరలిస్తున్నారన్నారు. చెరువు వ్యాసార్థం అనుసరించి రెండు వేలు క్యూబిక్ మీటర్ల నుంచి పది వేల క్యూబిక్ మీటర్ల వరకు అనుమతులు ఇస్తున్నా దాదాపుగా ఇచ్చిన పర్మిషన్ కన్నా పది రెట్లు తవ్వుతున్నారని దీని వలన పశువులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పెద్దలు సిండికేట్‌గా వ్యవహరిస్తూ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మట్టి తవ్వకాలను నిర్వహిస్తున్నారన్నారు. ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని మట్టి అక్రమార్కులకే పూర్తి మద్దతిస్తున్నారని వాపోయారు. మట్టి తవ్వకాలపై ప్రజలు అనేక ఫిర్యాదులు సంబంధిత అధికారులకు ఇచ్చినా దానిపై కనీసం ఎలాంటి స్పందన లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రారంభోత్సవానికి నోచుకోని సచివాలయ భవనాలు

అవస్థలు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు



ధర్మాజీగూడెంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనం

లింగపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోపోవటంతో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలో మొత్తం 19 సచివాలయ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.40 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. అయితే వీటిలో 12 సచివాలయాలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం చేయటంతో ఉద్యోగులు ఆ భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అనివార్య కారణాలతో తోచలకరాయుడుపాలెం, కొత్తపల్లి, రంగాపురం, ధర్మాజీగూడెం–2లో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. ధర్మాజీగూడెం–1, లింగపాలెం, మఠంగూడెం గ్రామాల్లో కూడా సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమయంలో జనరల్ ఎన్నికల కోడ్ రావటంతో వీటి ప్రారంభోత్సవం నిలిచిపోయింది.

కూటమి ఏర్పడి ఏడాది కావస్తున్నా..

అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఆ మూడు గ్రామాల్లో నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నప్పటికీ నేటికీ వీటిని ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీంతో అయా గ్రామాల్లో ఇరుకు భవనాల్లో ఉద్యోగులు విధులు నిర్వర్తించటం, మరో వైపు సచివాలయాలకు వెళ్లిన ప్రజలకు సరైన సదుపాయాలు లేకపోవటంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇరుకు గదుల్లో, ఉక్కపోతలో మగ్గి ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలు ఏడాది కాలంగా ప్రారంభోత్సవం చేయకపోడటంతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర నిరుత్సాహం చెందుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలు నిరూపయోగంగా పడి ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే సచివాలయ భవనాలను ప్రారంభోత్సవం చేసి అందుబాటులోకి తీసుకు రావాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



కమిషనర్లు, అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ ఆర్‌డీ డీఎస్ నాగనర్సింహరావు

జంగారెడ్డిగూడెం: ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ ఆర్‌డీ డీఎస్ నాగనర్సింహరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలను పట్టించుకోకుండా ఉంటే సహించేది లేదని, షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. అలాగే పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లపై నిర్లక్ష్యం వహించకూడదన్నారు. అలాగే చార్జిషీట్లు నమోదు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఏలూరులో చార్జిషీట్లు నమోదు చేస్తే రూ.20 కోట్లు ఆదాయం వస్తుందని అశ్రద్ధ వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్, కేవీ రమణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అద్దెల దరువు.. వసతులు కరువు





అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు

- నియోజవర్గంలో అంగన్‌వాడీలకు సొంత భవనాలు సమకూరేనా?
- ఇరుకు గదుల్లో సతమతమవుతున్న పిల్లలు

దెందులూరు: కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలి పౌష్టికాహారం అందజేయాలని అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో అరకొర భవనాలతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో సింహభాగం కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ భవనాలకు పట్టణాల్లో రూ. 6 వేలు, గ్రామాల్లో అయితే రూ. 2 వేలు చొప్పున ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది.

సదుపాయాలు లేక అవస్థలు

అద్దె భవనాల్లో వసతులు లేకపోయినా నెట్టుకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. చాలా కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండటం లేదు. అనేక చోట్ల పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల తాగునీటి సౌకర్యం గగనమే. అంగన్‌వాడీ సహాయకులు బిందెలతో తీసుకు రావాల్సిన పరిస్థితి. కొందరు పిల్లలు ఇళ్ల నుంచే మంచినీటిని తెచ్చుకుంటున్నారు. ప్రతి నెలా సరుకులకు వచ్చే కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు ఇరుకు గదులతో సతమతమవుతున్నారు. సొంత భవనాల నిర్మాణాల కోసం ఉన్నతాధికారులకు నివేదించామని విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక కొన్ని సామాజిక భవనాలను అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.

నియోజవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

దెందులూరు మండలం	30
పెదవేగి మండలం	37
పెదపాడు మండలం	27
ఏలూరు మండలం	17

విద్యతోనే సామాజిక అభివృద్ధి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి, మహిళలు

ద్వారకాతిరుమల: వ్యక్తిగత సామాజిక అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. మండలంలోని తిరుమలంపాలెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం 2.0 సెషన్–7 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య, కెరీర్ మార్గదర్శకాలు, నైపుణ్యాల ప్రాముఖ్యతను మేరి తెలియజేశారు. అంతే కాకుండా చదువుకోవడం వలన విలువలు పెరుగుతాయన్నారు. విద్యా వ్యవస్థ మధ్యలో బడి మానేసిన పిల్లలు ఓపెన్ స్కూల్స్ ద్వారా చదువుకోవచ్చన్నారు. అనంతరం సచివాలయ మహిళా కార్యదర్శి ఎస్‌కే అఫ్రీన్ మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమన్నారు. ఏఎన్ఎం నాగదుర్గ కిశోర బాలికలతో యోగా చేయించారు. అనంతరం గ్రామంలో విద్యా ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ ఏసమ్మ, అంగన్‌వాడీ ఆయా సాయమ్మ, జ్యోతి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సత్యసాయి కార్మికులకు జీతాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేగా ప్రభాకర్

కొయ్యలగూడెం: సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు ప్రభుత్వం బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.శివసత్యనారాయణ, సీపీఐ మండల కన్వీనర్ తాడిగడప ఆంజనేయరాజు ఆధ్వర్యంలో శుక్రవారం కొయ్యలగూడెంలోని ఏఎంసీ యార్డులో శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు కార్మికులకు జీతభత్యాలు చెల్లించలేదన్నారు. పథకంలోని కార్మికులు కుటుంబాల పోషణకు అప్పులపాలై దుర్భర స్థితిలో బతుకీడుస్తున్నారన్నారు. ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్ ముట్టడికి ఆయన పిలుపు ఇచ్చారు. జీతాలు ఈనెలాఖరులోగా చెల్లించని పక్షంలో కార్మికులు సమ్మె బాట పడతారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వీరబాబు, టి.రవీంద్ర ఎం.శ్రీనివాస్, బి.ప్రసాద్, ఎ.సత్యనారాయణ, సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఆధునీకరణ పనులు



పాఠశాలలో ఆధునీకరణ పనులను పర్యవేక్షిస్తున్న గ్రంథ పాలకుడు వెంకటేశ్వరరావు

దెందులూరు: గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల కళాశాలలో ఆధునీకరణ పనులు ప్రారంభించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలలో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలను ఇటీవల కళాశాలగా పదోన్నతి పొందిన నేపథ్యంలో పెరిగిన విద్యార్థులు అదనపు తరగతి గదులు పూర్తి సౌకర్యవంతంగా ఉండేందుకు ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. తమ పాఠశాల కళాశాలలో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నూరు శాతం ఫలితాలు రావడం ఉపాధ్యాయుల సమష్టి కృషి ప్రధాన కారణమన్నారు. నిర్మాణ పనులు పాఠశాల కళాశాలలో స్వచ్ఛభారత్ పనులను గ్రంథపాలకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు ప్రతిరోజు ఆయన పని చేస్తూ పర్యవేక్షించడం అభినందనీయమన్నారు.

యోగాచరణ దిశగా ప్రోత్సహించాలి

ఏలూరు(మెట్రో): రాష్ట్ర వ్యాప్తంగా కనీసం రెండు కోట్ల మందికి యోగాలో ప్రవేశం లక్ష్యంతో యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు వట్లూరులోని టీటీడీసీలో, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ యోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మనిషి జీవన నాణ్యతను పెంచేందుకు శ్రేయస్సుకు, యోగా గొప్ప మార్గమని తెలిపారు. ఇతివృత్తం, ఆధారిత యోగా సెషన్లతోపాటు పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. ట్రైనర్లు, పౌరుల రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ నెల రోజులు యోగాసనాలు అభ్యాసంతోపాటు ఆసనాల ప్రదర్శన, సూర్యనమస్కారం, ప్రాణాయామ ప్రదర్శన నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ మరో ముగ్గురిని యోగాచరణ దిశగా ప్రోత్సహించాలన్నారు.

మహిళను రక్షించిన శక్తి టీమ్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన ఒక మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు నెంబర్ 112కు ఫోన్ చేయగా శక్తి టీమ్ పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మహిళను రక్షించింది. ఏలూరు శక్తి టీం ఇన్‌చార్జి సీఐ ఎం సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన శిరీషకు వివాహమైంది. భర్త ఆన్ లైన్ ట్రేడింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో కుటుంబంలో కొద్దిరోజులుగా కలహాలు చోటుచేసుకుని ఆమె తీవ్ర మనస్థాపానికి గురైంది. శుక్రవారం సాయంత్రం ఎన్ఆర్ పేటలోని ఎన్ఆర్ఐ కళాశాల సమీపంలోని రైలు పట్టాల వద్దకు ఆత్మహత్యకు పాల్పడేందుకు వెళ్లింది. ఆమె కుటుంబ సభ్యులు 112కు సమాచారం ఇవ్వడంతో నిమిషాల్లోనే పోలీస్ శక్తి టీం ఆమె వద్దకు చేరుకుంది. ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శక్తి టీం సభ్యులను ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు.